ప్రజాశక్తి
సోమవారం 10 నవంబర్ 2025 5
శ్రీ సత్యసాయి

శ్మశానవాటిక దారి కోసం కలెక్టరేట్‌కు పాదయాత్ర

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

దళితుల శ్మశాన వాటిక దారి కోసం చిలమత్తూరు మండలం కొర్లకుంట గ్రామం నుండి దళిత యువకులు ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర ఆదివారం మామిళ్లకుంట క్రాస్‌కు చేరింది. దేమికేతేపల్లి రాజేష్ చేపట్టిన పాద్యఆత్ర సోమవారం కలెక్టరేట్‌కు చేరనుందిశుక్రవారం ఉదయం కొర్లకుంట శ్మశాన వాటిక నుంచి ప్రారంభించిన పాదయాత్ర సోమవారం ఉదయం పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకోనుంది. సోమారం అక్కడ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) లో జిల్లా కలెక్టర్ ను కలిసి తమ సమస్యను విన్నవించి పరిష్కారం కోరనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర, గోపాలకృష్ణ, నరసింహమూర్తి, రామాంజి, మూర్తి, నాగరాజు, లక్ష్మీపతి, గోపాల్, నరసింహప్ప, తిమ్మప్ప, చిన్నా ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతుల అనుమతి లేని భూసేకరణను ప్రతిఘటిస్తాం..

ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

రైతుసదస్సులో మాట్లాడుతున్న ఎపిరైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

అభివృద్ధి పేరుతో రైతుల అనుమతి లేకుండా భూములను సేకరిస్తే రైతన్నలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం రూరల్ మండలంతో పాటు లేపాక్షి, సోమందేపల్లి మండలం పరిధిలో ఉన్న గ్రామాలలో జరుగుతున్న భూ సేకరణను వ్యతిరేకిస్తూ ఆదివారం హిందూపురం రూరల్ మండలం చలివెందల గ్రామంలో రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి అధ్యక్షతన రైతులతో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి . శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హరి, జంగాలపల్లి పెద్దన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గత 15, 20 సంవత్సరాల క్రితం పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని మడకశిర, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు, హిందూపురం, ఓడిసి ప్రాంతాలలో వేలాది ఎకరాలు భూ సేకరణ పేరుతో రైతుల నుంచి భూములను లాక్కొన్నారన్నారు. సేకరించిన భూముల్లో ఇప్పటి వరకు ఒక్క పరిశ్రమను సైతం ప్రభుత్వాలు తీసుకురాలేదన్నారు. సేకరించిన భూములను తిరిగి ఆ రైతులకే ఇస్తూ వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు స్థాపించిన పరిశ్రమల్లో స్థానికులకు ఎంతమందికి ఉపాధి కల్పించారు, ఆయా ప్రాంతాలను ఎంత అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించాలన్నారు. చిలమత్తూరు వద్ద ఇదే టీడీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో ఎల్సినా రాగ మయూరి అనే సంస్థకు కేటాయించిన భూముల్లో ప్రస్తుతం వెంచర్లు వేసి భూమిని విక్రయిస్తున్నారన్నారు.కొంతమంది పారిశ్రామిక వేత్తలు కారు చౌకగా భూమిని ప్రభుత్వం నుంచి తీసుకొని, అదే భూమిని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి వందల కోట రూపాయల రుణాలు తీసు కుంటున్నారని అన్నారు. సేకరించిన భూముల్లో పరిశ్రమలు రాక ఆ భూములన్నీ బీడు భూములుగా మారిపోవడంతో పాటు రియల్ ఎస్టేట్, మనీ లాండరింగ్‌కి సాధనంగా భూములు మారుతున్నాయన్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఆ పార్టీ వారు రైతులను, రైతుల భూములను కామధేనువులాగా మార్చుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో విమర్శలు చేసి అధికారంలోకి రాగానే అదే విధానాలను అమలు చేస్తున్నారన్నారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం వీరికి అండగా ఉందన్నారు. అభివృద్ధికి రైతు సంఘం వ్యతిరేకం కాదని అన్నారు. అభివృద్ధి పేరుతో పంటలు పండే భూములను చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతుల భూములను లాక్కోవడం తగదన్నారు. వ్యవసాయానికి అనువు గాని భూములలో పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు. తప్పనిసరిగా భూమిని సేకరించడానికి ప్రభుత్వం ముందుకు వస్తే 2013 భూ సేకరణ చట్టాన్ని అనుసరించి భూ సేకరణ చేయాలన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి చట్టం గురించి రైతులకు సమగ్రంగా వివరించి రైతులు ఒప్పుకుంటేనే భూమిని సేకరించాలన్నారు. రైతుల అనుమతి లేకుండా భూములను సేకరించడానికి ప్రభుత్వం ముందుకు వస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజప్ప, రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచి చెన్నారెడ్డి, నాగిరెడ్డి తో పాటు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

తెలుగుతమ్ముళ్ల బరితెగింపు

వార్త రాసినందుకు ప్రజాశక్తి విలేకరి శంకర్‌పై భౌతికదాడి
ఫోన్ లాక్కొని.. కర్రలతో విచక్షణారహితంగా కొట్టిన వైనం..

ప్రజాశక్తి- చిలమత్తూరు

సిఎం బావమరది, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఇలాకాలో తెలుగు తమ్ముళ్లు బరితెగించారు. వార్త రాసాడన్న అక్కసుతో ఊగిపోయిన టిడిపి నాయకుడు తన కుమారుడు, అనుచరులతో కలసి దారి కాసి విలేకరిపై భౌతికదాడికి పాల్పడ్డారు. కర్రలతో చితకబాదారు. తెలుగు తమ్ముళ్లు మానవమృగాల్లా వ్యవహరించిన ఈ ఘటన్ల హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలంలో చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు... చిలమత్తూరు మండల కేంద్ర పరిధిలో రూ. 45 లక్షలతో ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద జరుగుతున్న సిసి రహదారి పనుల్లో నాణ్యతపై ఆ మండల ప్రజాశక్తి విలేకరి శంకర్ 'నాశిరకంగా రోడ్డు నిర్మాణం' శీర్షికన వార్తను రాశాడు. ఈ కథనం ఆదివారం ప్రచురితమైంది. దీన్ని జీర్ణించుకోలేని టిడిపి మండలనాయకుడు నాగరాజు యాదవ్ ప్రజాశక్తి విలేకరిపై దాడికి కుట్ర పన్నాడు. ఆదివారం ఉదయం విలేకరి ఇంటివద్దకు వెళ్లాడు. శంకర్ అందుబాటులోలేక పోవడంతో అతని కుటుంబ సభ్యులను బెదిరించాడు. అంతటితో ఆగక 'ఇంటి దగ్గరకు లేకపోతే రోడ్డులోకి రా' అని ఫోన్ ద్వారా శంకర్‌ని పిలిచాడు. ఈ నేపథ్యంలో శంకర్ తల్లి శంకర్‌కు ఫోన్ చేసి తమను బెదిరించినట్లు ఏడ్చుకుంటూ చెప్పింది. దీంతో బయటకు వెళ్లిన శంకర్ తన ద్విచక్రవాహనంలో ఇంటికి బయలు దేరాడు. అప్పటికే దారికాచి ఉన్న టిడిపి నాయకుడు నాగరాజు, ఆయన కుమారుడు, తన అనుచరులతో కలసి శంకర్ ద్విచక్రవాహనాన్ని శిరా రహదారి తుమ్మలకుంట క్రాస్ వద్ద అడ్డగించాడు. మొదట శంకర్ వద్ద ఉన్న ఫోన్‌ను లాక్కొన్నారు. ఆ సమయంలో వారి వద్ద ఉన్న కర్రలను చూసి భయపడిన శంకర్ పారిపోయేందుకు ప్రయత్నించగా వాహనం తాళం లాక్కొన్నారు. అప్పటికే తమతో తెచ్చుకున్న పెద్ద పెద్ద కర్రలతో విలేకరి శంకర్‌ను విచక్షణ రహితంగా బాదారు. దీంతో విలేకరి శంకర్ హైవే గుండా పారిపోయి వచ్చి చిలమత్తూరు స్టేషన్ చేరుకున్నాడు. అక్కడ పోలీసులు అందుబాటులో లేకపోవడంతో తన బంధువుల ఇంట తలదాచుకున్నాడు. తోటి విలేకర్ల సహాయంలో ఆదివారం సాయంత్రం పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ మునీర్‌అహ్మద్‌కు ఫిర్యాదు చేశాడు.

కర్రలతో దాడిచేయడంలో విలేకరి శంకర్ వీపుమీద ఏర్పడిన గాయాలు

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : శ్రీసత్యసాయిజిల్లా చిలమత్తూరు మండల ప్రజాశక్తి విలేకరి శంకర్‌పై జరిగిన దాడిని ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, డిప్యూటీ ఎడిటర్ రాంభూపాల్ ఖండించారు. దాడికి పాల్పడిన టిడిపి నాయకుడు నాగరాజుయాదవ్, అయన అనుచరులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాస్తవాలను వెలికితీసే విలేకరులపై ఇలా దాడి చేయడం నియంతృత్వ చర్య అని అన్నారు.

ముగిసిన 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా ఉత్సవాలు

ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అనంతపురం
పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తి నింపిన మంత్రులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్‌డిటి క్రీడా మైదానంలో ఈ నెల 7,8,9 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించిన 7వ రాష్ట్ర స్థాయి క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. మూడవ రోజు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత హాజరై ఉదయం ఉంచి రెవెన్యూ క్రీడాకారులతో పలు పోటీల్లో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించారు. క్రీడల ముగిసిన నేపథ్యంలో బహుమతుల ప్రధానోత్సవ సభ నిర్వహించారు. ఏపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన క్రీడా ఉత్సవాలు ముగింపు కార్యక్రమానికి మంత్రులతో పాటు, అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ, అంతర్జాతీయ బ్యాట్మింటన్ క్రీడాకారుడు కిడంబి శ్రీకాంత్, భారత టెన్నిస్ క్రీడాకారుడు మైనేని సాకేత్, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, పల్లె సిందూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ క్రీడా సాంస్కృతిక ఉత్సవాల్లో రెవెన్యూ ఉద్యోగులు మూడు రోజుల పాటు పని ఒత్తిడి మరిచిపోయి పోటీల్లో పాల్గొని మానసిక ఉల్లాసాన్ని పొందడం ఆనందంగా ఉందన్నారు. పారదర్శకమైన ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు పాత్ర ఎంతో కీలకం అన్నారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఇది ఉద్యోగుల ప్రభుత్వం అని సమాజాన్ని బాగు చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. మంత్రులు జిల్లాల అభివృద్ధికి పని చేసే మొదటి కూలీలు అన్నారు. పోలీస్ రెవెన్యూ శాఖ సేవలు ఎంతో కీలకం అన్నారు. రెవెన్యూ సేవలు ఎలా సులభతరం చేయలనే దానిపై దృష్టి సారిద్దామనిఅన్నారు. రెవెన్యూ క్రీడలను అధికారులు అందరూ చక్కగా నిర్వహించారని అభినందించారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తి కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులు క్రీడాకారులు జిల్లాకు వచ్చి క్రీడా పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా అనంతపురం జిల్లా నిలిచింది. క్రికెట్‌లో విజేతగా నిలిచిన అనంతపురం జట్టుకు మంత్రులు ట్రోఫీ అందజేసి అభినందించారు. అనంతరం ఆయా క్రీడాపోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మలోల, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, తెలంగాణా రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రరెడ్డి, ఏపి రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటరాజేష్, ఆర్‌డిఓ కేశవనాయుడు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజేత అనంతపురం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

బాలయ్య పట్టు వీడినట్లేనా..?

జిల్లాకేంద్రం హామీ అమలుపై అనుమానాలు
ఒక్కరోజూ పర్యటించని సబ్‌కమిటీ

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం అంటేనే గుర్తుకు వచ్చేది నందమూరి వంశం. హిందూపురం అసెంబ్లీ నియోజక వర్గం రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అందించడంతో పాటు పార్లమెంట్ నియోజక వర్గం నుంచి దేశానికి రాష్ట్రపతిని అందించింది. 1967లో హిందూపురం పార్లమెంట్ నియోజక వర్గం నుంచి నీలం సంజీవ రెడ్డి కాంగ్రెస్‌పార్టీ తరపున పోటీ చేసి గెలుపొంది 1971 వరకు ఎంపీగా పని చేశారు. ముఖ్యమంత్రి, రాష్ట్రపతిని అందించిన ఘనత గల హిందూపురానికి ఉంది. అంతటి చరిత్ర కలిగిన హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేయాలని ఎవరు కనీసం ప్రయత్నం సైతం చేయలేదు. అయితే బాలకృష్ణ జిల్లా కేంద్రం చేయాలని సంకల్పించినప్పటికి పూర్తి స్థాయిలో ప్రయత్నం చేయాలేదన్న విమర్శలు వినపిస్తున్నాయి.

అంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారిన తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా హిందూపురం జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఎప్పుడు నుంచో టిడిపి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కోరుతున్నారు. అప్పట్లో ఆయన స్వయంగా నిరసనలు తెలిపారు. హిందూపురంను జిల్లా కేంద్రంగా చేయాలంటూ పాదయాత్ర కూడా చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేస్తామంటూ ప్రకటించారు. ఇప్పుడు టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. అయినప్పటికి హిందూపురం పట్టణాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించలేదు. దీంతో పుర ప్రజల కల కలగానే మిగులుతున్నది. జిల్లాల పునర్విభజనలో గత వైసిపి ప్రభుత్వం లోపభూయిష్టంగా చేసిన విభజనతో ప్రజలు ఇబ్బందులు పడు తున్నారని, వాటిని సరిదిద్దుతామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాటలకు, వాటి అమలుకు చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. ఏడుగురు మంత్రులతో సబ్ కమిటీ వేశామని, మంత్రుల బృందం జిల్లాల్లో పర్యటించి, వినతులు స్వీకరిస్తుందని చెప్పారు. ఈ కమిటీకి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్ కన్వీనర్‌గా ఉన్నారు. బాలకృష్ణకు మంత్రి అత్యంత సన్నిహితులు కావడం, జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రి కావడంతో తప్పకుండా హిందూపురం జిల్లా కేంద్రం అవుతుందని అందరు ఆశించారు. అయితే మంత్రుల బృందం ఒక్కరోజూ ఇక్కడ పర్యటించలేదు. మంత్రి జిల్లాకు వచ్చిన ఈ విషయంపై నోరు మెదపలేదు. 2022 నుంచి రాజకీయ పార్టీలతో పాటు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు జిల్లా కేంద్రం ప్రకటించాలని డిమాండ్ చేస్తు నిరసన కార్యక్రమాలు చేస్తునే ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం సైతం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేసి వినతులు ఇచ్చారు. ప్రభుత్వం వాటిని పరిగణనలోకి తీసుకుని తమ ఆకాంక్షలను నెరవేరుస్తుందని అంతా భావించారు. అయితే కేబినెట్ సబ్ కమిటీ పరిశీలనలో అందులో ఏ ఒక్కటీ లేకపోవడంతో తీవ్ర నిరాశకు లోనవుతున్నారు.

హిందూపురాన్ని జిల్లాకేంద్రంగా ప్రకటించాలి

ఉమ్మడి జిల్లాలో అనంతపురం తర్వాత హిందూపురం అతిపెద్ద పట్టణం. జనాభా ప్రాతిపదికన ఉమ్మడి జిల్లాలో అనంతపురం తర్వాత హిందూపురం ప్రథమ స్థానంలో ఉంది. ప్రస్తుత శ్రీ సత్యసాయి జిల్లాలో అయితే హిందూపురం పట్టణమే పెద్దది కావడంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన ప్రాంతంగా ఉంది. హిందూపురం అన్ని ప్రాంతాలకు సమదూరంలో బస్ సౌకర్యం అందరికీ అందుబాటులో ఉంది. అందరికీ అందుబాటులో నేషనల్ హైవే కనెక్టివిటీ ఉంది. ఇన్ని సౌకర్యాలున్న హిందూపురం నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రం గా చేస్తానని నందమూరి బాలకృష్ణ ఎన్నికల సమయంలో వాగ్దానం చేశారు. హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేయాలని నందమూరి బాలకృష్ణ 2022 ఫిబ్ర వరిలో మౌన దీక్ష చేసి కలెక్టర్‌కు వినతి పత్రం కూడా ఇచ్చారు. అయితే ఆ సమయంలో బాలయ్య వినతులను ఎవరు పట్టించు కోలేదు.

అంబేద్కర్ సర్కిల్ జిల్లా కేంద్ర చేయాంటూ దీక్ష చేస్తున్న బాలకృష్ణ (ఫైల్ ఫొటో)

అయితే ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో హిందూపురం ప్రజలు హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేస్తారని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

బాలయ్యా.. దీక్షలు, నిరసనలు గుర్తున్నాయా..?

2019 ఎన్నికల్లో రాష్ట్రంలో ఫ్యాన్ గాలి వీసినప్పటికి హిందూపురంలో సైకిల్ పరుగులు పెట్టింది. వైసిపి ప్రభుత్వం ఉన్న సమయంలో బాలయ్య హిందూపురాన్ని జిల్లాకేంద్రం చేయాలని హిందూపురానికి మెడికల్ కాలేజీ కేటాయించాలని దీక్షలు, పోరాటాలు చేశారు. మన పార్టీ ఆంధ్రాలో గెలవగానే హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేద్దామని ఆసందర్భంగా అయనే చెప్పారు. అయితే ప్రస్తుతం జిల్లా కేంద్రం కాదు కదా కనీసం రెవిన్యూ డివిజన్ సైతం చేయలేదు.

పెదవి విరుస్తున్న ప్రతిపక్షాలు... ప్రజా సంఘాలు

ఎన్నికల సమయంలో బాలకృష్ణ హిందూపురం కేంద్రంగా శ్రీ సత్య సాయి జిల్లా చేస్తామని పేర్కొన్నారు. అయితే అధికారంలోకి రావడం, జిల్లాల పున ర్విభజనకు మంత్రులతో సబ్ కమిటీ వేయడం, నిర్ణయాలు తీసుకోవడం అంతా జరిగింది. అయితే హిందూపురం పట్టణాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించక పోవడంతో ప్రతిపక్షాలతో పాటు ప్రజా సంఘాల నాయకులు పెదవి విరుస్తున్నారు. టిడిపికి హిందూపురం చాలా ఇచ్చింది. అయితే హిందూపురానికి టిడిపి ఏమీ ఇవ్వలేదు అని వ్యాఖ్యానిస్తున్నారు.

'మిషన్ వాత్సల్య'తో పిల్లల పరిరక్షణ

బాలల పరిరక్షణ జిల్లా అధికారి మహేష్

ప్రజాశక్తి- పుట్టపర్తి అర్బన్

మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖలో అంతర్భాగమైన మిషన్ వాత్సల్య పథకం ద్వారా పుట్టిన పిల్లల నుంచి 18 సంవత్సరాల వయసు వరకు ఉన్న అనాథల ఆదరణ సంరక్షణ అవసరమైన పిల్లలకు వసతి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ తెలిపారు. ఆదరణ కరువై దిక్కులేని బాలలకు తగిన ఆశ్రయం కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ శాఖ ద్వారా బాలల సంరక్షణ కార్యక్రమం చేపట్టింది. సమాజంలో మనం ఎప్పుడో, ఎక్కడో ఒకచోట చెత్త కుప్పలో డస్ట్ బిన్లలో, ముళ్లపొదల్లో అప్పుడే జన్మించిన పిల్లలను వదలి వెళ్లడం చూస్తూనే ఉంటాం. నవజాత పిల్లలను అలా విడిచిపెట్టడం వెనక ఆ తల్లికి వచ్చిన కష్టం ఏమిటో మనకు తెలియదు. సాధారణంగా ఏ తల్లీ నవ మాసాలు మోసి ప్రసవం తరువాత అలా శిశు వును వదిలించుకోవడానికి ఇష్టపడదు. అలా జరిగిందంటే దానివెనుక పలు కారణాలు ఉండవచ్చు. అలాంటి సంఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే పోలీస్ స్టేషన్ లేదా మహిళా శిశు సంక్షేమ అధికారులకు, అంగన్వాడీ వర్కర్లకు సమాచారం ఇవ్వడం జరుగుతుంది. మరి కొంతమంది పిల్లలు తల్లిదండ్రులు ఆదరణకు కరువై జీవన పోరాటంలో బిక్షమెత్తుకుని తింటూ ఉండడం చూస్తుంటాం. అలాంటి ఆలనా పాలనా లేని నవజాత శిశువులు, అనాథలను ప్రభుత్వం ప్రత్యేకంగా బాలల సంరక్షణ శాఖ ద్వారా ఆదుకుంటోంది. ఈ నేపథ్యంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలు పలు అంశాలను వివరించారు.

ప్రశ్న : అనాథ, ఆదరణ కరువైన పిల్లల కోసం మీరు తీసుకొంటున్న చర్యలు ఏమిటి.?

అధికారి : ప్రభుత్వం ఇలాంటి అనాథలు, ఆదరణ కరువైన పిల్లల కోసం ప్రత్యేకంగా మిషన్ వాత్సల్య పథకం ప్రవేశపెట్టింది. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 18 సంవత్సరాలు వయస్సులోపు ఉన్న వారిని గుర్తించి వారికి తగిన ఆశ్రయం కల్పించి సంరక్షించడం జరుగుతుంది. అందుకు ప్రత్యేకంగా ప్రభుత్వం బాలల కోసం బాల సదనాలు ఏర్పాటు చేసింది. వారి ఆలనా పాలనా విద్య ఆశ్రయం కల్పించడం జరుగుతుంది.



ప్ర: జిల్లాలో ఎన్ని బాల సదనాలు ఉన్నాయి.? వాటి పనితీరు తెలపండి.?

అధికారి : సత్య సాయి జిల్లాలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా రెండు బాల సదనాలు ఉన్నాయి. అవి ధర్మవరం, హిందూపురంలో ఉన్నాయి. ప్రతి బాలసదనంలో ఆశ్రయం కల్పించడంతోపాటు ఒకటవ తరగతి నుంచి 6వ తరగతి వరకు ఉచిత విద్యను అందించబడుతుంది. అనాథలు, పాక్షిక అనాథ పిల్లలు, పోషించలేని స్థితిలో ఉన్న వారిని ఇక్కడ చేర్పించడం జరుగుతుంది. ఈ బాల సదన్ లో బాలల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆశ్రయం కల్పించడం జరుగుతుంది. అప్పుడే పుట్టిన పిల్లలు అనగా చెత్త కుప్పలో వదిలివేసిన పిల్లలను శిశుగృహంలో ఉంచి బాలల సంక్షేమ సమితి ద్వారా వారి సంబంధికులు రెండు నెలల వరకు కూడా రాని పక్షంలో అనాధగా ప్రకటించి చట్టబద్ధంగా దత్తత కురేవారికి అప్పగించడం జరుగుతుంది. పూర్తి అనాథలకు, పాక్షిక అనాథలకు, మానసిక, శారీరక వికలాంగులకు, హెచ్‌ఐవి ఉన్న బాలలకు ప్రతినెల ఒక్కొక్కరికి నాలుగు వేల రూపాయలు ప్రభుత్వం మూడేళ్లపాటు సాయం అందిస్తుంది.

ప్ర: మీ శాఖ ద్వారా ఇంకా చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి.?

అధికారి : బాలల హక్కులు వారి సంరక్షణ, బాల్యవివాహాల వల్ల జరిగే అనర్ధాలు, బాలల పై జరిగే లైంగిక దాడులు తదితర విషయాల గురించి ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇందుకు హెల్ప్‌లైన్ 1098 వినియోగించుకోవాలని కోరుతున్నాం. ఎక్కడైనా అలాంటి సంఘటనలు జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చు. జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్లో సంబంధిత అధికారులకు బాల్య వివాహాల నిరోధక చట్టం, లైంగిక నేరాల నిరోధక చట్టం. బాలల న్యాయ చట్టం పై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం.

ప్ర: కిశోరి వికాసం కోసం చేపడుతున్న చర్యలు ఏమిటి.?

అధికారి : కిశోరి వికాసం బాలల యొక్క సాధికారిక అనే నినాదంతో కలెక్టర్, ఐసిడిఎస్ పీడీ ఆదేశాలతో కిశోరి వికాసంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు చేపడుతుంటాము. బాల్యవివాహాలు నిరోధించడం, వ్యక్తిగత పరిశుభ్రత, యోగ, ఆత్మరక్షణ, ట్రాఫికింగ్ తదితర అంశాలపై ప్రతి మండలంలోని రిసోర్స్ పర్సన్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు శిక్షణ పొందిన వారు పాఠశాలల్లో, కళాశాలలో 11 నుంచి 18 సంవత్సరాల వయసు గల వారికి అవగాహన కల్పించడానికి కృషి చేస్తారు. 11 నుంచి 14 ఏళ్ల బాల బాలికలకు గ్రూపులు ఏర్పాటు చేసి పిల్లల సమస్యలపై తెలుసుకోవడం జరుగుతుంది. బాల బాలికలు సమస్యలపై కరపత్రాలు, గోడ పత్రికల ద్వారా ప్రచారం చేయడం జరుగుతుంది.

ప్ర: ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?

అధికారి : అనాథ పిల్లల పట్ల సానుభూతిగా ఉండాలి. గ్రామాల్లో బాల్య వివాహాలు, లైంగిక దాడులు జరిగిన వెంటనే అక్కడి అంగన్వాడీలకు, హెల్ప్‌లైన్‌కు తెలపాలని కోరుతున్నాం. అలాగే గ్రామస్థాయి కమిటీలకు సహకరించాలని కోరుతున్నాం.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఉద్యోగుల హామీల అమలులో ప్రభుత్వం విఫలం

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి

యుటిఎఫ్ ఆఫీస్ బేరర్ల సమావేశానికి హాజరైన నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి విమర్శించారు. పట్టణంలోని మౌర్యా రెసిడెన్సీలో ఆదివారం యుటిఎఫ్ ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు గత ప్రభుత్వంపై చేసిన పోరాటాలు కూటమి అధికారంలోకి రావడానికి దోహదపడ్డాయన్నారు. మెరుగైన వేతనాలు ఇస్తామని, అన్ని రకాల బకాయిలు 6 నెలల్లో చెల్లిస్తామని మాట ఇచ్చిన కూటమి పెద్దలు అధికారం చేపట్టి 17 నెలలు గడుస్తున్నా అమలు చేయలేదన్నారు. గడువు పూర్తయి రెండేళ్లు దాటినా 12వ పిఆర్‌సి ఊసే లేదన్నారు. 4 డిఎలకు గాను ఒక డిఎ మాత్రమే ఇచ్చారన్నారు. క్రమం తప్పకుండా డిఎలు చెల్లించకపోతే ఉద్యోగులు ఎలా బతకాలని ప్రతిపక్ష హోదాలో మొసలి కన్నీరు కార్చిన కూటమి నేతలు ఇప్పుడు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇంకా రూ. 25 వేల కోట్లకు పైబడి ఉద్యోగుల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. మూడేళ్లుగా సరెండర్ లీవ్ బకాయిలు చెల్లింపులకు నోచుకోలేదన్నారు. తక్షణం 12వ పిఆర్‌సిని ప్రకటించాలని, పిఆర్‌సి అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. ఇన్ సర్వీస్ టీచర్లు టెట్ ఉత్తీర్ణత సాధించాలనే సుప్రీం కోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలన్నారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సాల్ట్ పథకం ఒప్పందంలో భాగంగా విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుంచి ప్రభుత్వం క్రమేపీ తప్పుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తుందని విమర్శించారు. బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాలు ప్రకటించినా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు ఉద్యోగోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని, లేనిచో పోరు ఉద్ధృతం చేయక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, కోశాధికారి డి.శ్రీనివాసులు, కార్యదర్శులు నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, శివశంకర్, జీ.నరేష్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ మారుతి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్రంలో ప్రజల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన మంత్రి సవితతో కలిసి 42 మంది లబ్ధిదారులకు రూ. 38 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఇన్‌ఛార్జి మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలెవరూ వైద్యం కోసం అప్పుల పాలు కాకూడదని ముఖ్యమంత్రి సహాయనిధి అమలు చేస్తున్నామన్నారు. సిఎం సహాయనిధి పేద, మధ్య తరగతి వర్గాలకు వరంలాంటిది అన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ

సిఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న మంత్రులు అనగాని, సవిత

పథకం ద్వారా అర్హులైన వారికి ఉచితంగా కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్ కుమార్, కురుబ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాసులు, మంజునాథ్, మండల కన్వీనర్ దండు ఈశ్వర్‌ప్రసాద్, నాయకులు చిన్నప్పయ్య, రఘువీరాచౌదరి, రామలింగ, ఎనుముల రామకృష్ణ, అంగడి రామాంజనేయులు, పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలని వినతి

పెనుకొండ నగర పంచాయతీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములుయాదవ్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు వినతి పత్రం ఇచ్చారు. కూటమి నాయకులు మాట్లాడుతూ పెనుకొండ నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ ఇప్పటివరకు ఆ స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. రహదారులు, డ్రెయినేజీ, వీధి దీపాలు, నీటి సరఫరా, శానిటేషన్ వంటి మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించాలని కోరారు.

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రజాశక్తి-హిందూపురం

వైద్యరంగంలో పిపిపి విధానాన్ని రద్దుచేసి, ప్రభుత్వమే వైద్య కళాశాలలను నిర్వహించాలని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆదివారం ప్రముఖుల సంతకాలతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని నాయకులు స్థానిక ఎంజిఎం స్కూల్ వద్ద ఉన్న భగత్‌సింగ్ విగ్రహం వద్ద విడుదల చేశారు. సామాజిక కార్యకర్త, బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ సభ్యులు ఎన్.రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అన్నారు. దాని నుంచి వైదొలుగుతూ ప్రయివేటుపరం చేయడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు చాలా నష్టపోతారన్నారు. వైద్య కళాశాలలను ప్రయివేటుపరం చేయడం వల్ల సామాన్య ప్రజలకు వైద్య విద్య అందని ద్రాక్ష అవుతుందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ ఆసుపత్రులు మూతపడే అవకాశం ఉందన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.మల్లికదత్‌కుమార్ మాట్లాడుతూ రూ. 3,800 కోట్లు ఖర్చు పెడితే ఈ వైద్య కళాశాలను ప్రభుత్వమే నిర్మించవచ్చు అన్నారు. పిపిపి నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించేంత వరకూ ప్రతి ఒక్కరూ ఉద్యమించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, రవీంద్ర, సలీమ్ బాషా, త్రిశాంత్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు రామకష్ణారెడ్డి, స్నేహ శ్రీ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ మారుతిశంకర్

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కొత్తచెరువు

రౌడీ షీటర్లు సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో ఉండాలని సిఐ మారుతిశంకర్ తెలిపారు. సిఐ ఆదివారం రౌడీ షీటర్లను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో ప్రజలకు ఆటంకం కలిగించినా, దాడులకు పాల్పడినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎలాంటి గొడవలు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కదిరి టౌన్

విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అడ్వొకేట్ సోషల్ వర్కర్ కె.నరసింహులు సూచించారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణం లోని బాలికల హాస్టల్‌లో హాస్టల్ అధికారి ప్రసన్నకుమారి అధ్యక్షత న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిం చారు. ముఖ్యఅతిథులుగా హాజరైన న్యాయవాదులు నరసింహులు, లోకేశ్వర్‌రెడ్డి జాతీయ న్యాయ సేవల దినోత్సవం ఔన్నత్యాన్ని వివరించారు. మహిళా సంరక్షణ చట్టాలను తెలుసుకోవాలన్నారు. మైనర్ బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం గట్టిగా గుణపాఠం చెబుతోందని గుర్తు చేశారు. తల్లిదండ్రుల కష్టానికి ఫలితంగా చదువుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. మహిళల సంరక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయని, విద్యార్థి దశ నుంచే వాటి గురించి తెలుసుకోవాలన్నదే ప్రజా న్యాయస్థానాల ఆశయమన్నారు.

వైభవంగా వాల్మీకి జయంతి

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని శంకరగల్లు గ్రామంలో ఆదివారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. వాల్మీకి సామాజిక వర్గం మహిళలు కళశాలు నెత్తిన ఎత్తుకుని, హారతులు చేతబూని డప్పువాయిద్యాల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. బస్టాండ్‌లో ఉన్న వాల్మీకి విగ్రహానికి వాటిని సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో కుల మతాలకు అతీతంగా ప్రజలందరూ పాల్గొని ఐకమత్యాన్ని చాటారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో నాయకులు బాది పల్లెప్ప, చిన్నస్వామి, చంటి, గోవిందప్ప, నాగేంద్రప్ప, రమేష్, అరుణ్‌కుమార్, సంజీవప్ప, విజయకుమార్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సౌభాగ్య

ప్రజాశక్తి-గుడిబండ

ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మండలంలోని జమ్మలబండ గ్రామానికి చెందిన సౌభాగ్య ఎన్నికయ్యారు. ఇటీవల అనకాపల్లిలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ 5వ మహాసభ నిర్వహించారు. అందులో జిల్లా నుంచి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సౌభాగ్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా రాధ ఎన్నికయ్యారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై న్యాయ పోరాటం చేస్తామని, హక్కులు సాధించుకోవడం కోసం ఎల్లప్పుడూ పని చేస్తామని తెలిపారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి : పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఆర్టీసీ బస్సు డిపో ముందు పార్క్, చిత్రావతి నది వద్ద నిర్మిస్తున్న చిల్డ్రన్ పార్క్, హారతి ఘాట్, పుట్టపర్తి చుట్టూ రింగ్ రోడ్డు, సీసీ రహదారులు, తదితర పనులను పరిశీలించారు. పనులను నాణ్యతగా గడువులోపు పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పల్లె వెంట టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, నాయకులు ఉన్నారు.

పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి పల్లె, అధికారులు, టిడిపి నాయకులు,

ప్రజా సేవలో భాగమే వైద్య శిబిరం

ప్రముఖ ఈఎన్‌టి వైద్య నిపుణులు శంకర్ నాయక్

ప్రజాశక్తి-హిందూపురం

పరీక్షలు నిర్వహిస్తున్న డా. శంకర్‌నాయక్

ప్రజలకు తన వంతు సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు శంకర్ ఈఎన్‌టి అసుపత్రి వైద్యులు శంకర్‌నాయక్ తెలిపారు. పట్టణంలోని ఆర్‌పిజిటి రోడ్డులో ఉన్న అల్ హిలాల్ పాఠశాల ఆవరణలో ఆదివారం ఈఎన్‌టి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శంకర్ నాయక్ చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడుతున్న 450 మందికి నూతన సాంకేతికతో కూడిన వైద్య పరికరాలతో పరీక్షలు నిర్వహించి అవసమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే పలు సూచనలు చేశారు. ప్రముఖ వైద్య నిపుణులు వెంకటరమణనాయక్ మాట్లాడుతూ పట్టణ, పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. శిబిరంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు కృషి

హిందూపురం: పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పట్టణంలోని ఎస్‌డిజిఎస్ కళాశాల కమిటీ కార్యదర్శి బైసాని రాంప్రసాద్ పిలుపునిచ్చారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని పూలకుంటలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు వాలంటీర్లతో కలిసి గ్రామంలోని శివాలయం వద్ద పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటి ముందు తప్పనిసరిగా మొక్కలు పెంచేలా ఆయా పంచాయతీలు, మున్సిపాలిటీలు తీర్మానం చేయాలన్నారు. మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను వాలంటీర్లు ప్రజలకు వివరించి చైతన్యవంతులు చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అశ్వర్థ నారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజన్న, ఫిజికల్ డైరెక్టర్ హేమంత్ కుమార్, అధ్యాపకులు రాము పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు చదువుతో పాటు సేవాభావం అలవర్చుకోవాలని సప్తగిరి డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపల్ శ్రీనాథ్‌రెడ్డి, పరిపాలనాధికారి గంగిరెడ్డి సూచించారు. ఆ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వారం రోజులుగా మండలంలోని కొల్లకుంట గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరం ఆదివారం ముగిసింది. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక, సేవారంగాల్లో పాలుపంచుకోవడం వల్ల సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, ప్రజల జీవనశైలి, తదితర అంశాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం భాస్కర్, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ ఎస్.పార్థసారథి, టిడిపి జిల్లా అధ్యక్షులు అంజనప్ప, కౌన్సిలర్ మల్లికార్జునగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

ధర్మవరం రూరల్ : మండలంలోని మలకాపురం గ్రామస్తులు ఆదివారం గొట్లూరు అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. హైదరాబాద్‌కు చెందిన మద్దిలేటి సోదరుడు ఎం.ప్రకాష్ మాట్లాడుతూ మద్దిలేటి అనంతపురం కలెక్టర్ ఆఫీస్‌లో ప్రజలకు అర్జీలు రాసి ఇచ్చేవాడన్నారు. ఎం.మద్దిలేటి జ్ఞాపకార్థం అన్నదానం చేశామన్నారు. కార్యక్రమంలో తల్లి మొండి పెద్దక్క, సోదరుడు ప్రకాష్, ఎం.ఫక్కీరప్ప, నరసమ్మ, నవీన్, చిన్నా, నరసింహులు, పెద్దక్క, మహేశ్వరి, ఎం.నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

పంట పొలమా .. పాఠశాల ప్రాంగణమా..!

మోకాలి ఎత్తు పెరిగిన గడ్డిలో ఇబ్బందులు పడుతూ బాత్‌రూమ్ వెళ్తున్న విద్యార్థినులు, వర్షానికి బురదగా మారిన మైదానంలో బండల ముక్కలపై నడుస్తున్న విద్యార్థులు

ఈ చిత్రాలు చూసి విద్యార్థులు క్షేత్రస్థాయిలో పంట పొలాల పరిశీలనకు వెళ్లారని అనుకుంటే మీరు పొరపడినట్లే.. ఇది రొద్దం మండలంలోని పెద్దగువ్వలపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం. సుమారు 8 ఎకరాలు ఉన్న ఈ పాఠశాల ఆవరణలో పంట పొలాన్ని తలపించేలా దట్టంగా మొకాలి ఎత్తు పిచ్చిగడ్డి ఏపుగా పెరిగింది. విద్యార్థినులు బాత్‌రూమ్‌కు వెళ్లాలంటే ఈ గడ్డిలోనే నడిచి వెళ్లాల్సి ఉంది. ఇందులో విష పురుగులు సంచరించే అవకాశం ఉంది. దీంతో పిల్లలు బాత్‌రూమ్ వైపు వెళ్లాలంటే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పాఠశాల ప్రాంగణం మొత్తం నల్లరేగడి భూమి కావడంతో చిన్నపాటి వర్షం కురిసినా బురదగా మారుతుంది. దీంతో పిల్లలు బురదలో బండల ముక్కలు వేసి వాటిపై అడుగులో అడుగు వేస్తూ నడుస్తున్నారు. వారు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా జారి పడే ప్రమాదం ఉంది. పాఠశాల ప్రాంగణంలో గడ్డి తొలగించడంతో పాటు ఎర్రమట్టి తోలించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజాశక్తి-రొద్దం

సత్వర పరిష్కారమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యం

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

కెజిబివిలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎడిజె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

సమస్యలకు సామరస్యంగా సత్వర పరిష్కారం చూపడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్, కెజిబివిలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ చిన్నపాటి తగాదాలు, ఘర్షణల విషయంలో పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాల చుట్టూ తిరిగి వ్యయ ప్రయాసాలకు గురి కాకుండా ఎలాంటి ఫీజు చెల్లించకుం డానే లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్, సినిమాలు, తదితర వాటితో సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకొని సమాజంలో మెలగాలన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో ఉండాలని, వారిని పనుల్లో ఉంచుకోవడం నేరమన్నారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే వాహనాలు నడపాలన్నారు. అనంతరం ఎడిజె శైలజ కెజిబివిలో ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు సుదర్శన్, మురళి, రవిచంద్ర, లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, పారా లీగల్ వాలంటీర్లు, హాస్టల్ వార్డెన్‌లు పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటమా..?

మద్యం మత్తులో ఆటో నడిపిన డ్రైవర్‌పై మంత్రి ఆగ్రహం

ప్రజాశక్తి-పెనుకొండ

ఆటో డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి సవిత

'ఆపదలో ఉన్న వారికి మానవత్వంతో సాయం చేయడమే కాదు.. తప్పు చేసిన వారిని సుతిమెత్తగా హెచ్చరించ డానికీ మంత్రి సవిత వెనుకాడరని అనడానికి పట్టణంలో ఆదివారం చోటుచేసుకున్న సంఘటనే నిదర్శనం. వివరాలు.. అనంతపురం వైపు నుంచి వచ్చిన మంత్రి సవిత వాహనం పట్టణంలోకి ప్రవేశిస్తున్న సమయంలో ఓ ఆటో డ్రైవర్ రోడ్డుపై ఇష్టారాజ్యంగా వాహనం నడుపుతూ పదే పదే అడ్డుగా వచ్చాడు. దీంతో మంత్రి వాహనం నుంచి దిగి ఆటోను ఆపా రు. డ్రైవర్ మద్యం మైకంలో ఉన్నట్లు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో ఆటో నడపం వల్ల నీతో పాటు ప్రయాణికులు, రోడ్డుపై వెళ్లే వారి ప్రాణాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని మండిపడ్డారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లను పిలిపించి ఆటో డ్రైవర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఎస్‌ఐ ఆటోతో పాటు డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్న 104 సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్.నరసింహులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అరబిందో సంస్థ నుంచి ఉద్యోగులకు బకాయిలు రావాల్సి ఉందన్నారు. ప్రస్తుత యాజమాన్యం భవ్య హెల్త్ కేర్ సర్వీస్ ప్రయివేట్ లిమిటెడ్ కూడా ఉద్యోగులపై పనిభారం పెంచిందన్నారు. ఇప్పటివరకు ఒక్క ఉద్యోగికి కూడా నియామక పత్రం ఇవ్వలేదన్నారు. 104 సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి పని భారం తగ్గించాలన్నారు. ఫార్మాసిస్టులను నియమించి డిఇఒలను డ్రగ్స్ నిర్వహణ బాధ్యతల నుంచి మినహాయించాలని, పిఎఫ్ బకాయిలు చెల్లించాలని, వాహనాలకు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ చేయించాలన్నారు. సమావేశంలో 104 ఎంఎంయు యూనియన్ నాయకులు మోహన్, జయచంద్ర, అబ్దుల్లా, నాగరాజు, నరేష్, సిఐటియు జిల్లా కార్యదర్శులు సాంబశివ, పైపల్లి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా గుడ్డం రంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

అశేష భక్తజనం మధ్య రథోత్సవం

పట్టణంలో ప్రసిద్ధి చెందిన గుడ్డం రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బ్రహ్మరథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామిని ఆభరణాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను రథంలో కొలువుదీర్చి భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. మహా మంగళ హారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం, అన్నదానం చేశారు. గోదర్శనం, గోపూజ, ముత్తయిదువులకు వడి బియ్యం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో నిర్వహించిన అన్నమయ్య గానలహరి ఆకట్టుకుంది. కార్తీకమాసం సందర్భంగా రాత్రి సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. భక్తులు మొక్కుబడి తీర్చుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్‌కుమార్, జెపికె.రాము, దేవాదాయ శాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

గురునానక్‌కు నివాళి

ప్రజాశక్తి-హిందూపురం

పండ్లు పంపిణీ చేస్తున్న సిక్కులు

హిందూ, ముస్లిం, సిక్, క్రైస్తవులు సిక్ సత్ సంగత్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్ అధ్యక్షతన పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద ఆదివారం గురునానక్ జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేష్‌కుమార్, వైస్ ఛైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్ ఆసీపుల్లా, న్యాయ వాదులు ఇందాద్, శివశంకర్, షేక్ షబ్బీర్, అజ్మతుల్లా ఖాన్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గురునానక్ ప్రపంచ మానవాళికి సోదర భావంతో జీవించటం నేర్పించారన్నారు. పట్టణంలో జాతీయ సమైక్యత, దేశభక్తి పెంపొందించేలా అన్ని మతాల పండుగలను సోదరభావంతో నిర్వహించడం అభినందనీయం అన్నారు. సిక్కు కుటుంబాలు సుమారు 2 వేల మందికి పండ్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిక్ సంగత్ ప్రతినిధులు బలవీందర్ సింగ్, భగవాన్‌సింగ్, సత్యపాల్‌సింగ్, జర్నయిల్ సింగ్, జస్వంత్‌సింగ్, బియాంత్‌సింగ్, గురుబక్ష్ సింగ్, అపార్‌సింగ్, జగతార్‌సింగ్, ముక్తియార్ సింగ్, రాణాసింగ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

పుట్టపర్తి అర్బన్ : పట్టణంలోని కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఆదివారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ అందుబాటులో ఉంటారని ప్రజలు అర్జీలు సమర్పించవచ్చన్నారు. అలాగే మండల, డివిజన్, స్థాయిలో కూడా గ్రీవెన్స్ నిర్వహిస్తారన్నారు. అక్కడ పరిష్కారం కానీ సమస్యలపై మాత్రమే కలెక్టరేట్‌లో అర్జీలు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కంది పంట సాగుపై అవగాహన

ధర్మవరం రూరల్ : కంది పంట సాగుపై మండల వ్యవసాయ అధికారి ముస్తఫా రైతులకు అవగాహన కల్పించారు. ఆయన ఆదివారం కంది పంటను పరిశీలించి పలు సలహాలు, సూచనలుచేశారు. అలాగే పంట ఎదుగుదల, అధిక దిగుబడి, తెగుళ్ల నివారణకు వాడాల్సిన మందులను సూచించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

పుట్టపర్తి రూరల్ : పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న సత్య సాయి భక్తుడు సూర్యనారాయణ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. అంత్యక్రియలు నిర్వహిం చడానికి ఎవరూ లేకపోవడంతో ఖిద్మత్ ఎ ఖల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి షామీర్ సభ్యులు అలీ, ఆది, జావిద్ సాయంతో మృతదేహాన్ని వైకుంఠ రథంలో కర్నాటక నాగేపల్లి విద్యుత్ దహన వాటిక కు తరలించారు. అక్కడ హిందూ సంప్రదాయం పరంగా అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం రూరల్ : అనారోగ్యంతో పాటు మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని కోట ప్రాంతానికి చెందిన శివ(35), నవనీత భార్యాభర్తలు. వారికి ఓ కొడుకు ఉన్నాడు. శివ చెక్క పని పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మద్యానికి బానిసైన అతడు సంపాదనలో కుటుంబ అవసరాలకు ఏమాత్రం డబ్బులు ఇవ్వకుండా మద్యం తాగుతూ జులాయిగా గడిపేవాడు. తరచూ భార్యతో గొడవ పడేవాడు. దీంతో శివ తల్లి, భార్య, బంధుమిత్రులు మద్యం తాగడం మానుకోవాలని పలుమార్లు సూచించినా అతడిలో మార్పు రాలేదు. దీనికి తోడు ఐదేళ్లుగా నరాల బలహీనతతో బాధ పడేవాడు. పది రోజులుగా పనికి కూడా వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో మద్యం తాగడానికి డబ్బులు లేక భార్యతో రోజూ గొడవ పడేవాడు. ఈ క్రమంలో గత శనివారం ఇంట్లో చెప్పి భార్య కొడుకుతో పాటు కసాపురం వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శివ చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం కసాపురం నుంచి తిరిగి వచ్చిన భార్య ఇంటి తలుపు తీసి చూడగా శివ ఉరికి వేలాడుతూ కనిపించాడు. విషయం తెలిసిన వెంటనే వన్ టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కారు దహనం.. పిరికిపంద చర్య

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

వైసిపి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి కారును దహనం చేయడం పిరికిపంద చర్య అని వైసిపి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమీర్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. షెడ్డులో ఉంచిన కారుపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి తగలబెట్టిన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. శాంతిభద్రతల పరిరక్షణలో కూటమి ప్రభుత్వం వైఫల్యానికి ఈ ఘటన నిదర్శనమన్నారు. ఉద్యమాల్లో రాటు తేలిన గౌతమ్‌రెడ్డి ఇలాంటి చర్యలకు భయపడే వ్యక్తి కాదన్నారు. కారు దహనం చేసిన వారిని పోలీసులు ఎందుకు గుర్తించలేకపోయాని ప్రశ్నించారు.

In the court of the Junior Civil Judge, Madakasira
O.S.No: 88/2025
Between:
Sujatha ...Plaintiff
V/s
D1. Sathyanarayana Reddy
D2. Chandrasekhar Reddy
D3. H.S Lakshmi ...Defendants
Notice to the Defendant. No: 1,2 And 3
పై దావాను వాదులు మీ పైన మడకశిర జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు నందు సివిల్ కేసు వేసినారు. పై దావా నందు మీరు అనగా 1వ 2వ మరియు 3వ ప్రతివాదులైన అయిన వారు ఈ నోటీసు కోర్టువారు పేరురు పబ్లికేషన్‌ను అర్డర్ వేసినారు. కావున 1వ 2వ మరియు 3వ ప్రతివాదులైన అయిన మీరు 11-11-2025 మడకశిర జూనియర్ సివిల్ జడ్డి కోర్టు నందు హాజరు అయిన మీరు కాని మీ లాయర్ హాజరు అయి వాదనలు వినపించుకొనవలెను.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
Sri.P.E.Lokesh,
Smt.B.C.Kalpana,
Advocates, Madakasira-515 301,
Sri Sathya Sai Dist, A.P,
Cell:8331843850